# ఆశీర్వదించి గెలిపిస్తే సేవ చేస్తా



పోచన్నపేటలో పల్లా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే
- కరువును జయించిన జనగామ నియోజకవర్గం
- సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ తరహాలో అభివృద్ధి చేస్తా
- తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేటలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం
- నీరాజనం పట్టిన జనం..
- బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికిన ప్రజలు

బచ్చన్నపేట, అక్టోబర్ 28 : స్వయంగా సీఎం కేసీఆర్ జనగామ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో నన్ను మీ వద్దకు పంపించిండు. ఆదరించి.. ఆశీర్వదించి జనగామ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీకు సేవ చేస్తానని జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పల్లాకు బ్రహ్మరథం పట్టారు. కేసీఆర్ వెంటే తామంతా ఉంటామని పల్లాకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జనగామకు వచ్చిన సీఎం తన గురించి ప్రజల సమక్షంలో వెల్లడించారని గుర్తు చేశారు. పల్లా 24 గంటలు నా ఇంట్లో వ్యక్తి. మీ కోసం మీకు సేవ చేసేందుకు జనగామకు పంపిస్తున్నా.. ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత మీది.. మీకు పనులు చేసి పెట్టే బాధ్యత నాది అని అన్నారని ఆయన మరోసారి గుర్తు చేశారు. తనకు ఒకసారి అవకాశమిస్తే జనగామను సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు ధీటుగా తీర్చిదిద్దుతానన్నారు. సీఎం దగ్గర నిధులు ఎలా తేవాలో, మంత్రుల వద్ద నిధులు ఎలా మంజూరు చేయించుకోవాలో నాకు తెలుసన్నారు. ఒకనాడు కరువుకు చిరునామా అయిన జనగామ, బచ్చన్నపేట సీఎం కేసీఆర్ చలువతో నేడు గోదావరి జలాలతో సస్యశ్యామలమైందన్నారు. పుష్కలంగా పంటలు పండుతున్నాయని, ప్రతి రైతు దర్జాగా బతుకుతున్నాడన్నారు. పంటలకు పెట్టుబడి, రైతుబీమా, పంట రుణమాఫీ, కేసీఆర్ కిట్లు, పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి ఎన్నో అద్భుత పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి మహిళకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద ప్రతి మహిళలకు నెలకు రూ.3 వేలు ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో రూపొందించారని తెలిపారు. పంట పెట్టుబడి ఎకరానికి రూ.16 వేలకు పెంచనున్నట్లు చెప్పారు. అన్ని రకాల పింఛన్లు ఐదేండ్లలో రూ.5 వేలకు పెంచేలా ప్రణాళికలు వేశారని వివరించారు. ఆరోగ్యశ్రీ కింద రూ.15 లక్షల వరకు ఖర్చులు అందించే వీలు కల్పించనున్నట్లు చెప్పారు. రైతుబీమా తరహాలో భూమిలేని వారికి కూడా కేసీఆర్ బీమా అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక నెల రోజుల్లో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఇచ్చిన సమస్యలతోపాటు గ్రామాల్లో తాను కూడా ప్రజలకు ఏమీ కావాలో సర్వే చేయించామని చెప్పారు. జనగామను ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్‌తో కొట్లాడి నిధులు తీసుకొస్తానన్నారు. రుణమాఫీ అందరికీ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పంట నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మితే మనమంతా నట్టేట మునిగినట్టేనన్నారు. పదేండ్లుగా కష్టపడి పనిచేస్తున్న ప్రభుత్వానికి పట్టం కడుదామని ప్రజలు ముందుకొస్తున్నారని తెలిపారు. ఉద్యమంలో కేసీఆర్‌కు తోడుగా బచ్చన్నపేట మండల ప్రజలు నిలిచారని గుర్తు చేశారు. తెలంగాణలో నాడు 24 లక్షల మెట్రిక్ టన్నులు పండిస్తే నేడు 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తున్నామని తెలిపారు. పింఛన్ల పెంపుతో వృద్ధులు, మహిళల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. వారి కాళ్లపై వారే నిలబడడంతోపాటు మనవడికి బిస్కట్లకు ఇచ్చే స్థాయికి ఎదిగారన్నారు. అనంతరం పోచన్నపేటలో పల్లా సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకు చెం దిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకు ముందు బచ్చన్నపేట మండలం కొడవటూరులో సిద్దేశ్వర స్వామిని పల్లా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచు, ఎంపీటీసీ మేకల కవితారాజు, గుర్రాల లలితానర్సిరెడ్డి, ఎండీ ఖలీల్‌ఆజాం, మామిడి అరుణాఐలయ్య, మాజీ శాసన మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, నాయకులు, సర్పంచు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, జనగామ ఎంపీపీ కళింగరాజు, మద్దూరు మండల నాయకులు మల్లేశం, మద్దికుంట రాధ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లద్నూర్‌లో మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 28 : ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన సింగబట్టు నారాయణరాజు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి శనివారం పరామర్శించారు. లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు తుజాలపురం రవి తల్లి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మల్లారపు రాజు తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఎంపీపీ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, నందనబోయిన నర్సింహులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు స్వర్గం లక్ష్మయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బావండ్లపల్లి కృష్ణ, నాయకులు రాంరెడ్డి, నలుగొప్పుల రాములు, దండు సోమయ్య, డాకూరి తిరుపతిరెడ్డి ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌కే మా ఓటు

### సలాఖపూర్‌లో కురుమ సంఘం ఏకగ్రీవ తీర్మానం



పల్లాకు తీర్మానపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 28 : ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే ఓటేస్తామని మద్దూరు మండలం సలాఖపూర్ గ్రామ కురుమ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శనివారం జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి కురుమ సంఘం కుల పెద్దలు తీర్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురుమ సంఘం పెద్దలు మాట్లాడుతూ కురుమలకు జీవనోపాధిని కల్పించాలనే సదుద్దేశంతో సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కురుమల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మలిపెద్ది మల్లేశం, మాజీ ఎంపీటీసీ ఐలయ్య, నాయకులు వెంకట్రమణారెడ్డి, నాంపల్లి చంద్రశేఖర్, శెట్టె ఐలయ్య, శెవొల్ల లింగం, కురుమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## 'రైతుబంధు' వద్దన్న కాంగ్రెస్‌ను బొంద పెట్టాలే..



విలేకరులతో మాట్లాడుతున్న మేక సంతోష్‌కుమార్

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 28 : 'రైతుబంధు'ను వద్దంటున్న కాంగ్రెస్‌ను ఎన్నికల్లో బొందపెట్టాలని బీఆర్‌ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, పంట రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక రైతుబంధును నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి లేఖ రాయడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధే బీఆర్‌ఎస్‌కు తిరుగులేని విజయాన్ని సాధించి పెడతాయన్నారు. ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఆ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మలిపెద్ది మల్లేశం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఖాజా ఆరీఫ్, నాయకులు పుట్ట వెంకటరమణారెడ్డి, నాంపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

## మల్లన్న ఆలయం మూసివేత

చేర్యాల, అక్టోబర్ 28 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని శనివారం మూసివేశారు. రాత్రి 1.16 నిమిషాల నుంచి రాత్రి 1.51 గంటల వరకు రాహుగ్రస్త చంద్రగహణం సంభవిస్తున్నందున్న సాయంత్రం 4.15 నిమిషాల నుంచి ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలు రేణుకాఎల్లమ్మ, హనుమాన్ ఆలయాలను సైతం మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయంలో సంప్రోక్షణ, ప్రాత:కాల పూజలు నిర్వహించిన తర్వాత దర్శనాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.

## మహిళల రక్షణకు కఠిన చట్టాలు



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలోని మహిళలు, బాలికల రక్షణకు కఠినమైన చట్టాలు ఉన్నాయని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని గుర్జకుంట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికలు, మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్నేహిత మహిళా సెంటర్‌లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎవరైనా అవహేళనగా మాట్లాడినా, వెంబడించినా వెంటనే 100కు కాల్ చేయాలని సూచించారు. సదస్సులో హెచ్‌ఎం విజయలక్ష్మి, హుస్నాబాద్ డివిజన్ షీటీమ్ బృందం సైదయ్య, హెచ్‌సీ, పీసీలు స్వప్న, ప్రశాంతి, మల్లేశం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కృషి చేయాలి

చేర్యాల, అక్టోబర్ 28 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు లక్ష్యం ఏర్పాటు చేసుకుని, దానిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని వీరన్నపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.ఎల్లమ్మ సూచించారు. శనివారం మండలంలోని వీరన్నపేట పాఠశాలలో హెచ్‌ఎం తన సొంత ఖర్చులతో 6వ తరగతి విద్యార్థులకు షూస్, సాక్స్‌లు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి విద్యను అభ్యసించినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పాఠశాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.భిక్షపతి, ఎంపీటీసీ వై.శివశంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ బి.శ్రీశైలం, ఉపాధ్యాయులు కె.ప్రసాద్, ఎం.పద్మ, పి.వెంకటరమణ, ఎం.ప్రభాకర్, బి.మల్లేశం, బి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## యుద్ధవీరుల స్తూపానికి మట్టి సేకరణ

చేర్యాల, అక్టోబర్ 28 : దేశ రాజధాని ఢిల్లీలో యుద్ధవీరుల స్మారకార్థంగా నిర్మించే అమరవీరుల స్తూపానికి కొమురవెల్లి, కొండపాక మండలాల నుంచి మట్టిని సేకరించినట్లు నెహ్రూ యువ కేంద్ర మాజీ వలంటీర్ కటకం అమరేందర్ తెలిపారు. రెండు మండలాల నుంచి సేకరించిన మట్టిని శనివారం ఢిల్లీకి తీసుకెళ్లినట్లు చెప్పారు.

## 'మల్లన్న' క్షేత్రంలో చోరీ

చేర్యాల, అక్టోబర్ 28 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వాటర్ సప్లయి సామగ్రిని భద్రపరిచే గది తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు రూ.70 వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. స్వామివారి క్షేత్రంలో విలువైన సామగ్రి చోరీకి గురికావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.